# 13. చేదోడు

బుధవారం ఉదయం.

చాలా రోజులుగా చెప్తున్న విషయాన్నే ఇప్పుడు మళ్లీ చెప్తున్నాడు శేషగిరి.

భార్య వరమ్మ. 'ఊఁ' అంటూనే ఉన్నది.

"ప్రతి వస్తువు రేటూ పెరిగిపోతూ వుంది. రోజురోజుకూ మనలాంటి వాళ్ళకి బతుకు బండిని లాగటం కష్టమవుతోంది. నా వల్ల గావటం లేదు."

వరమ్మ మాట్లాడలేదు. 'ఊఁ' కూడా అనలేదు. ఒక్కొక్కప్పుడు ప్రత్యేకంగా 'ఊఁ' అనదామె. తలతిప్పుతూనో, కళ్ళు చక్రాల్ని చేసో, చూపులు మరల్చో 'ప్చ్' అని పెదవి విరిచో- ఆ 'ఊ'కి రూపాన్నీ, అర్థాన్నీ ఇచ్చి ఊరుకుంటుంది.

"నే చెప్పిన సంగతిని కాస్త సీరియస్‌గా తీసుకో" "శేషగిరి నిజానికి ఇంకా కొంత బాధని వెళ్ళగక్కు కోవలసినవాడే. కానీ వరమ్మ పనిలో ఉంది. ఇట్టాంటి సంభాషణకి వేళగాని వేళ. ఆగాడు.

'అట్టాగే' అన్నది స్టౌ దగ్గరకి నడుస్తూ.

'భార్య' అయినప్పట్నుంచీ వరమ్మ ఒక్కమాట సమాధానాలూ, రెండు మాటల వివరణలూ బాగానే నేర్చుకుంది. కన్నెగా- తెలివైనదీ, చురుకైనదీ అని అమ్మానాన్నలచేతా, ఇరుగుపొరుగు వాళ్ల చేతా పొగిడించుకున్న పిల్లే వరమ్మ. 'టెన్త్ పాసయింది దానికేం' అని తోటి స్నేహితురాళ్ల అసూయనీ రుచి చూసిన 'స్టూడెంటే!'

'మా అమ్మాయ్ బంగారం' అనేవాడు తండ్రి. ఆయనేదో కంపెనీలో కారు డ్రైవరు. 'సాల్లే సంబడం. ఆపై సదువు సంగతేంది?' అనేది తల్లి. ఆమెకి వరమ్మ అరచేతిలో నిమ్మపండు. వరమ్మ తమ్ముడు పిచ్చయ్యేమో- కంటి వెలుగు! అమ్మానాన్నల ఆలోచనంతా వరమ్మ సుఖం గురించే. 'మా బంగారు తల్లికి మంచి మొగుడు రావాలి!' ఆశల మొగ్గల్నీ, కోరికల పూలనీ కోసుకుంటూ

వుండేవారు! కానీ చదువు అక్కడే కూసింది. సంబంధాల వేట మొదలైంది. రెండేళ్ళు ఇట్టే గడిచాయి.

గోచార ఫలాలు చూసుకుంటూ వుండటం. జాతకాల ఫలితాల్ని బేరీజు వేసుకుంటూ వుండటం అలవాటు తండ్రికి. కూతురికీ చెప్తూ వుండేవాడు. వింటుంటే ఉత్సాహంగానే ఉండేది వరమ్మకి. నిద్రలో రంగు రంగుల కలలు వచ్చేవి. రాకుమారుడు వరుడుగా కనిపించేవాడు. అత్తింటి వైభోగం కాసులపేర్లుగా, పట్టుచీరెలుగా మురిపిస్తూ వుండేది.

శేషగిరి తటస్థపడ్డాడు తండ్రికి. ఏదో కంపెనీలో గ్రూప్ - డి పోస్ట్ ఉద్యోగం. అమ్మానాన్నా ఆనందిస్తుంటే తానూ 'కాబోలు' అనుకుంది వరమ్మ.

'పిచ్చిమొద్దూ, నీక్కాబోయే ఆయన ప్యూనంటే' అని పక్కింటి కరుణ అంటే ఉడుక్కుంది. బుంగమూతి పెట్టుకుని 'వీళ్ళందరికీ లోలోపల కుళ్ళు' అనుకుంది. ఈలోగానే ఆ 'మంచి' సంబంధం ఖాయమైపోయింది. 'నలభైవేలకి కొట్టేశాడు అల్లుణ్ణి' అన్నాడు కరుణ తండ్రి ముసిలయ్య!

'ఏదో మన తాహతుకు తగినవాడులే తల్లీ. పెళ్ళాం పిల్లలకి రెండు పూటలా తిండి పెట్టలేకపోడు' అన్నాడు తండ్రి. 'అవును' అనుకుంది వరమ్మ.

ఆ ధైర్యంతోనే శేషగిరితో బతుకుదారి పట్టింది.

అప్పట్నుంచీ -వరమ్మకి ఈ 'ఊఁ', 'ఆఁ'లు అలవాటయిపోయినై.

స్నానమయి లోపలికొచ్చాడు శేషగిరి. "తోటకూర కట్టలు కూడా ఐదురూపాయలకి మూడు. వంకాయలు పావుకిలో ఆర్రూపాయలైనై"

"అవును"

"రోజులు మండిపోతున్నై. ఈ ఫిఫ్తదాన్నీ, ఆ థర్డ్‌వాణ్ణీ - ఫీజులతో, పుస్తకాలతో, డ్రెస్‌లతో - తట్టుకోవాలంటే, నువ్ కూడా నాలుగు రాళ్ళు సంపాయించక తప్పదు."

"నిన్న ఆ కాలేజీ వాళ్లనడిగా. ఉదయం తొమ్మిది నుంచీ రాత్రి ఎనిమిద దాకా డ్యూటీ తప్పదంటున్నారు" చెప్పింది.

"వీళ్ళిద్దరూ నాలుగింటికే తయారవుతారుగా ఇంటికి. వాళ్లనేం చేస్తావ్?""

"అందుకనే - అది కుదరదు"

"మరి.... వేరే ఆలోచించు"

"ఊ, ఇవ్వాళా చూస్తా"

వంట పూర్తయింది. తిండి అయింది. బ్యాగ్‌లూ, డ్రెస్‌లూ, బాక్స్‌లు, షూస్.... ! 'వెళ్ళొస్తా'లూ!

షిఫ్తది గడప దగ్గరే నిలబడింది. 'ఆ పుస్తకం తేకపోతే, డ్రెస్ ఊడదీయించి నిలబెడతానంటోందే మామిస్. ఇవ్వాళ తేవాలి'. అర్ధింపు. ఆర్థింపులో భయం భయంలో హెచ్చరిక.!

భర్త వైపు చూపులు తిప్పింది వరమ్మ. "కొందాం లేరా. రేపు తెస్తానని చెప్పు" శేషగిరి భరోసా ఇచ్చాడు.

పిల్లలు కదిలారు.

శేషగిరీ అన్నానికూర్చున్నాడు. "ఆ పేపర్‌లో కొన్ని గీతలు పెట్టాను. చూడు. అడ్రస్‌లు వేరే రాసుకో. అందర్నీ కాంటాక్ట్ చెయ్యి. నెంబర్లు రాలేదని వదిలేసి నిద్రపోకు."

"ఊ... అట్లాగే"

"పోయి రావాలంటే – బస్‌లు జాగ్రత్త. ఎక్కడో ఆలోచిస్తూ ఎక్కి దిగడం చెయ్యకు."

తల ఊపింది.

శేషగిరి డ్యూటీకి కదిలాడు.

వరమ్మ కూడా నాలుగు మెతుకులు గతికింది. గిన్నెలో కంచాలు కడిగి, పేపర్ ముందేసుకూర్చుంది. భర్త గుర్తుపెట్టిన నంబర్లన్నింటినీ వేరే కాగితం మీద లిస్ట్ మీద రాసుకుంటుంటే, రెప్పలు వాలుతున్నై. కాళ్లు లాగేస్తున్నై, నీరసం.

గోడకి చేరగిలబడింది.

గతం సలుపుతోంది.

రెండేళ్ళనుంచీ ఈ నీరసం తనని ఇట్లాగే పీక్కు తుంటోంది, రెండేళ్ల క్రితం – ఒకరోజు ఉన్నట్టుండి తమ్ముడు ఫోన్‌చేశాడు– 'అమ్మకి అస్సలు బాలేదక్కా నువ్వూ బావా బయల్దేరి రండి" అని. ఆ మాట వినగానే నీరసం ఆవహించింది. కాళ్ళూ, చేతులూ చల్లబడినై. గంట తర్వాత గానీ తేరుకోలేక పోయింది. ఉరుకులూ

పరుగులతో – గుంటూరు పెద్దాసుపత్రికి చేరుకునేటప్పటికీ అంతా అయిపోయింది.

అమ్మ చనిపోయింది.

అదే మొదలు. నీరసం. నీరసం.. 'ఎనీమియా' అన్నాడు డాక్టరు. బలమైన తిండీ, పళ్లూ పాలూ తీసుకోమన్నారు. నవ్వొచ్చింది తనకు! ఏడాదిపాటు – మరీ లేవలేనప్పుడు మెడికల్‌షాపు ట్యాబ్‌లెట్లూ లేదా గచ్చాకు పుచ్చాకు వైద్యం. నీరసానికి తోడు అడపా దడపా దగ్గు రావటం మొదలైంది.

ఏడాది క్రితం నెల తప్పింది. ఆ వాస్తవం తెలిసేసరికీ తను మరీ నీరస పడింది. శేషగిరి భయపడ్డాడు. లేడీడాక్టరు దగ్గరికి పోతే... టెస్ట్‌లు. . మందులు.... చివరకి ఆమె సలహా యిచ్చింది. "ఈ పరిస్థితిలో బిడ్డని కనలేవు. ఇంకా రెండో నెల కదా. ట్యాబ్‌లెట్స్ వాడు. బహిష్టవుతావు" అని. 'సరే'అనుకున్నారు తానూ, శేషగిరీ. ఆ గండం గడిచింది. కానీ ఈ నీరసం నిలిచిపోయింది.

కలత నిద్ర నుంచీ, ఆలాపన నుంచీ ఉలిక్కిపడినట్లు లేచింది వరమ్మ. వెళ్ళి మొహాన్న నీళ్ళు చల్లుకుని వచ్చింది. నెంబర్ల లిస్ట్ తీసుకుని బయటకి కదిలింది.

టెలిఫోన్ బూత్ కొచ్చింది. మేరీ సన్నగా నవ్వింది. 'యుద్ధం మొదలా?' అంటూ, 'కానీ ఏం చేస్తాం?' అని ఫోన్‌ని అందించింది. ఆ బూత్‌కి ఓనర్ మేరీ' ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ ! వరమ్మకి బాగా పరిచితురాలు.

వరమ్మకి నెంబర్లు కలపటంలో సహాయం చేస్తోంది మేరీ.

"అవునండీ. కంప్యూటర్ నాలెడ్జ్ కావాలి..." ఫోన్ పెట్టేసింది వరమ్మ. మరో నెంబరు కలిసింది.

"ఇక్కడ రిసెప్షనిస్ట్ అంటే ఇంగ్లీష్ బాగా వచ్చుండాలి. మీరు టెన్త్ కదా, సరే ఇంటర్వ్యూకి రండి. చూస్తాం."

మేరీ నవ్వింది. "నాకూ వినపడుతోందిలే వాళ్ళ మాట" అంది. "అడిగితే ఠక్కున అందించేవాళ్ళలా అడ్వర్‌టైజ్‌చేస్తారు. తీరా జూస్తే – మనలాటోళ్ళకి ఎండమావులే" అని నిస్పృహని తెలిపింది. వేరే నెంబర్ కొట్టింది, కలిసింది.

"మాది ఈవెంట్ మేనేజ్‌మెంటండీ. ఉదయం తొమ్మిదికల్లా రావాలి. వెళ్ళటానికి ఫిక్స్‌డ్ టైమింగేమీ ఉండదు. అవసరమైతే రాత్రల్లా వుండి వర్కర్స్ చేత పని చేయించాల్సి వుంటుంది."

వేరే నెంబర్ తగిలింది. 'బంజారాహిల్స్ బ్రాంచిలో మనిషి కావాలమ్మా. మీరేమో దిల్‌సుఖ్ నగర్ అంటున్నారు కదా. కుదరదు, మాకు ఈ ఏరియాలో నివసించే వాళ్ళు కావాలి."

మళ్ళీ నవ్వింది మేరీ. చూసే వారికెవరికైనా అంతర్యం అర్థమయ్యే నవ్వది. 'రోజూ నీకీ అవస్థేవిటే తల్లీ' అంటున్న జాలి నవ్వది. 'నువ్ చదివిన చదువుకూ నీకూ ఉద్యోగాలేం వస్తాయి చెల్లాలా?' అని సానుభూతి చూపుతున్న నవ్వది.

నిరుత్సాహంతో ఉసూరుమంది వరమ్మ. నిస్పృహతో నిట్టూర్పు విడిచింది. నిస్సత్తువతో స్టూలు మీద కూచుండిపోయింది. 'ఇవాళ్టి కింక ఏ కంపెనీలకీ, ఆఫీసులకీ వెళ్ళనఖ్ఖర్లేదు' అనుకుంది.

మేరీ తన పనిలో నిమగ్నమయింది. ఆ పని – చీరెలకి ఫాల్స్ కుట్టటం. ఖాళీగా వుండకుండా ఈ వ్యాపకం పెట్టుకుంది. వ్యాపకం కాస్తా చిన్న వ్యాపారంగా – ఫాల్స్ అమ్మకంలోకీ దిగింది. ఆ కాలనీలో ఉద్యోగినులూ, పెద్దింటి ఆడవాళ్ళూ ఆమె క్లయింట్స్ ఇవ్వాళ!

మేరీనే చూస్తూ కూచుంది వరమ్మ. ఫోన్ కోసం వచ్చేవాళ్ళు వస్తున్నారు. వెళ్ళే వాళ్ళు వెళ్తున్నారు. బంక్‌లో మేరీ పక్కగా పెట్టుకున్న పోర్టబుల్ టీవీ రంగుల్నీ, అరుపుల్నీ కక్కుతోంది.

నిజానికి కొన్నాళ్ళ క్రితం వరమ్మ కూడా ఇంట్లో కుట్టుమిషన్ పెట్టుకుందామనే ఆలోచన చేసింది. శేషగిరి వొప్పుకోలేదు, కారణం– లేడీ డాక్టర్ వొకసారి మిషన్ కుడితే ఇంతే సంగతులు. సరాసరి టీబీలోకి పోతావ్ జాగ్రత్త" అని హెచ్చరిక చేసింది.

అక్కడికి వచ్చిన మనిషెవరో పెద్దగా అరుస్తూ ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆలోచన నుంచీ ప్రస్తుతానికొచ్చింది వరమ్మ. టీవీ మీదకి దృష్టి మళ్ళింది. ఎవరో నిరుద్యోగి ఆత్మహత్య వార్త ప్రసారమవుతోంది. క్షణంలోనే ఛానెల్‌ని మార్చింది మేరీ. ఇప్పుడు – కుటుంబ కలహాల వలన భర్త చేతిలో భార్య హత్య కథనం వస్తోంది.

వెన్ను చరచినట్లయింది వరమ్మకి. మనసు పరిపరి విధాల పోయింది. ఏవేవో ఊహలు మేథలో సుడి తిరగసాగాయి. భయం ఆవహించింది శరీరాన్ని.

ఇప్పుడేవిటి దారి? భర్త భారాన్ని తగ్గించి కుటుంబాన్ని ఆదుకోవటం ఎలా?సంపాదించే ఇరవు లేకపోతే రోజులు గడవడం కష్టం.

వరమ్మకి శేషగిరి స్వభావం, స్వరూపం ఇటీవలి అతని ప్రవర్తనా మదిలో కొచ్చినై. విసుగూ,. చిరాకూ ఎక్కువైనై. ఎప్పుడూ పరధ్యానం. జీతం లెక్కలూ, ఖర్చు భయం. ఆందోళన. నిజానికి – ఈ మధ్య తనంటే రాత్రుళ్ళు ఉత్సాహం చూపటం లేదు.! ఈ పరిస్థితుల్ని ఎట్టా తట్టుకోవాలి? ఇంకా ఏ ప్రయత్నం చేయగలదు తను?

వరమ్మకి వొళ్ళు జలదరించింది. ఆపైన – ఆలోచనకు అందని 'ఆ సంబంధం' ఆమెకు తత్తరపాటు కలిగించింది వళ్లంతా చెమటలు పట్టింది.

'అన్నాలైనయ్యా వరమ్మా?' మేరీ ప్రశ్నకు తల వూపింది. యాంత్రికంగా స్టూలు మీది నుంచీ లేచింది. ఫోన్ బిల్లుకు పైసలిచ్చి 'వస్తాను మేరీ' అంటూ కదిలింది.

❖ ❖ ❖

కనిచీకటి వేళ

అన్నం తినకుండా కూచుని ఏడుస్తూ సాధిస్తోంది. ఫిఫ్త్ ! నిన్నటి పుస్తకం సమస్యకి తోడు మరో 'డిమాండ్'ని పట్టుకొచ్చింది. ఎక్స్‌కర్షన్‌కి తీసుకుపోతాం. రెండువందలు తెమ్మన్నారు. ఈ ఆదివారమే ప్రోగ్రాం., శనివారం లోగా యివ్వాలి.

కాళ్ళు నేలకేసి తాటించీ, ఆరిచీ చేతుల్తో అమ్మ కొంగునీ కాళ్ళనీ వేధించీ, కళ్ళు పుళ్ళు చేసుకుంటున్నాడు థర్డ్! వాడిని టీచర్స్ డే సాంస్కృతిక కార్యక్రమానికి సెలక్ట్ చేశారు. వైట్ డ్రెస్ కావాలి!

మాటలు రాలేదు వరమ్మకు. ఒకటి రెండు వచ్చినా ఎట్టా చెప్పాలో తెలీలేదు. పిల్లల ఘోషని తన... లోఅలజడిని చేసుకుని కూర్చుండిపోయింది.

ఆమెకు మనసు కించపడినట్లయింది. పిల్లల చిన్న చిన్న సంతోషాలూ, కోరికలూ తీర్చలేకపోతున్నామే అని వ్యధపడింది. శేషగిరికి ఈ అవసరాల్ని చెప్పటమెలా అనే ప్రశ్నే ఆమెని వేధించసాగింది.

కూతురికీ, కొడుక్కీ 'అట్టాగే.... అట్టాగే" అనే హామీనిచ్చి తాత్కాలికంగా శాంతింప చేసింది. పిల్లలిద్దరికీ స్నానం చేయిం, ఉతికిన బట్టలు వేసి, బుజ్జగిస్తూ అన్నం తినిపించింది.

తాను భారంగా లేచి స్నానం చేసి తయారయింది. నిరామయ వాతావరణంలో తన ఆలోచన లోకి తాను దిగింది.

❖ ❖ ❖

రాత్రి పదిగంటలు దాటింది. పిల్లలు నిద్రపోయారు భర్తకు దినచర్యని అప్పచెప్పింది వరమ్మ.

శేషగిరి విసుక్కున్నాడు. తనని తాను తిట్టుకున్నాడు. ఖర్మని నిందించుకున్నాడు. గతన్ని ఏకరువు పెట్టుకున్నాడు. తల్లీదండ్రీ చిన్నతనంలోనే చనిపోవటం తనే తన దౌర్భాగ్యం మొదలైందన్నారు. మేనమామ సంరక్షణలో పడిన అవస్థల్ని చెప్పుకున్నాడు. ఆయన ప్రెస్‌లో బండపనులన్నింటినీ తన నెత్తిన రుద్దిచదువుని కొండెక్కించి ఇలాజనాన్ని చేశాడని బాధపడ్డాడు. చేదోడు వాదోడు లేని ఒంటరి బతుకైె పోయిందని వేష్టపడ్డాడు. చివరికి, 'వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా నువ్వూ ఎంతో కొంత సంపాదించగలవనుకున్నా గానీ ఇట్లా యాతనలు పడతావనుకోలేదు' అని నిష్టూరంగా అన్నాడు.

వరమ్మ మనసు నొచ్చుకుంది. నవ్వో ఏడుపో తెలీని ముఖకవళికల్ని విషాదపరం చేసింది.

శేషగిరిని ఉక్రోషంగా చూసింది. ఆ వెంటనే అతనన్నాడు. 'నీ వల్లే నాకే ప్రయోజనం లేకుండా పోయింది' అని పక్కకి తిరిగి పడుకున్నాడు.

వరమ్మకి గుండె పట్టేసింది. కళ్ళ నీళ్ళు తిరిగినై. ఏడుపు గొంతుకలో కొట్టుకులాడింది. అర్థం చేసుకున్నాడు. చిరాకు పడ్డాడు. "ఈ ఏడుపు మాత్రంవుంది. అప్పు పుట్టకా, ఖర్చు తప్పకా, నెలనెలా నేనట్టా ఏడుస్తున్నానో తెలీసీ.. అర్థం చేసుకోవు"

తెలియకేం? అంతా తెలుస్తూనే వుంది. వచ్చే జీతానికీ క ఆవలసిన అవసరానికీ మధ్య అఖాతం తనకు తెలినిదేం కాదు. తెలిసి. ఏం చేయాలిప్పుడు? – ఇదీ ప్రశ్న.

ఏం చేస్తావో ఏమో. నెలకో వెయ్యన్నా వస్తే కాస్త ఊపిరి పీల్చుకోవచ్చు" ఇదీ ముక్తాయింపు.

❖ ❖ ❖

గురువారం రాత్రి. పదకొండు గంటలవుతోంది.

శేషగిరి, వరమ్మ - ఒకరి పక్కగా మరొకరు.

ఎదురుగా గోడమీద కలాం గారి బొమ్మ

"పిల్లల్ని చక్కగా ఎదగనివ్వాలి."

తాడూ బొంగరం ఉన్నట్టే అనిపిస్తాయి. చేతి కందవు.

ఇద్దరూ అన్యమనస్కంగానే మసలుతున్నారు.

కప్పుకేసి చూస్తూ ధ్యాసని ఎక్కడో నిలిపి చెప్పింది వరమ్మ. "ఇవాళ... ఉద్యోగం... దొరికింది.."

ఆశ్చర్యపోయాడు శేషగిరి. భార్య వైపు చూశాడు.

"అవును. ఎదురుగా వున్న అపార్ట్‌మెంట్లలో రెండిళ్ళల్లో పని మనిషిగా కుదిరాను. నెలకి పన్నెండు వందలొస్తుంది"

వొళ్ళు జలదరించింది శేషగిరికి.

అస్పష్టంగా ఏవేవో ఊహలు. ఎన్నెన్నో ఆలోచనలు.

కణతలు టకటక కొట్టుకుంటున్నట్టనిపించింది.

గుండె బరువుగా అనిపించింది. మనసు వ్యథచెందింది. ఉన్నట్టుండి, ఆప్యాయంగా భార్యవైపు జరిగాడు. అనురాగంతో ఆమెని కౌగిలించుకున్నాడు.

ఆలోచనలను ఆపి, పక్కకి తిరిగి అతనికి దగ్గరైంది వరమ్మ.

ఆమె చేతిమీద శేషగిరి కన్నీటి చుక్క!

శేషగిరి వివశుడైనాడు. మాట కట్టుపడింది. గొంతు మూగబోయింది. గుండె గుండెకి చెప్పుకుంది. "సారీ వరం. నిన్ను కష్టపెడుతున్నాను"

సమయమూ, సందర్భమూ వెలుగునీడల్లోకి జారుకున్నాయి!!

(నవ్య, 19.9.2012)